# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 189 | శనివారం | 27 జనవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




## కోదండరామ్‌కు ఎమ్మెల్సీ.. ప్రజా ఉద్యమాలకు గౌరవం

అభినందనలు తెలిపిన ఆల్ ఇండియా ఓబీసీ జాక్

8లో..

# ఉచితాలతో.. FREE డేంజర్




**అధికారం కోసం అలవికాని హామీలు**

**ఖజానాను గుల్ల చేస్తున్న నేతలు**

**అప్పుల ఊబిలో కూరుకు పోయిన రాష్ట్రం**

**ప్రజలే నిలదీయాలంటున్న రాజకీయ విశ్లేషకులు**

అధికారమే లక్ష్యంగా రాజకీయ పార్టీలు పాకులాడుతున్నాయి. ప్రజలను ఓటు బ్యాంకుగా మార్చేందుకు అలవికాని హామీలను గుమ్మరిస్తున్నాయి. ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా పథకాలను రూపొందిస్తున్నాయి. సంక్షేమం అన్న ముసుగు తగిలించి ఖజానాలను గుల్ల చేస్తున్నాయి. లక్షల కోట్ల అప్పులు చేస్తూ అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నాయి. తమ చేతికి ఎముక లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. నగదు జమ చేస్తూ కోలుకోలేని స్థితికి నెట్టేస్తున్నాయి. అయితే ఇలాంటి ఉచితాలపై ప్రజలే తిరగబడే రోజులు రావాలంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ప్రజలు చెమటోడ్చి కట్టిన పన్నుల డబ్బులను ఇలా దుబారా చేయడంపై నిలదీయాలంటున్నారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటుంటే.. పాలకులు అధికారం కోరుకుంటున్నారంటున్నారు. రాష్ట్రం ఏమైతే మాకేంటి అనే పద్ధతి మారాలంటున్నారు. ఆదాయ వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న విన్యాసాలకు స్వస్తి పలకాలంటున్నారు. లేకుంటే ఆర్థిక సంక్షోభం తప్పదని హెచ్చరిస్తున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..



8లో..

## అక్రమ నిర్మాణాలపై బల్దియా కొరడా

పలు ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు

కట్టడాలను కూల్చివేసిన అధికారులు

## పది ఫలితాల్లో.. జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలి

ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమీక్ష

మంచి మార్కులు సాధించాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



8లో..



2లో

## ఠాకూర్‌కు భారతరత్న ప్రతి ఒక్కరికీ గర్వకారణం

జన నాయకుడికి విశిష్ట గౌరవం ఇచ్చిన కేంద్రం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

# ఉచితాలతో.. డేంజర్





**అధికారం కోసం అలవికాని హామీలు**

**ఖజానాను గుల్ల చేస్తున్న నేతలు**

**అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రం**

**ప్రజలే నిలదీయాలంటున్న రాజకీయ విశ్లేషకులు**

**వరంగల్ వాయిస్, వరంగల్:** దళితబంధు, రైతుబంధు వంటి పథకాలతో బొక్కసాన్ని కొల్లగొట్టారు. అధికారం పోయాక ఇప్పుడు అవే పథకాలు అమలు చేయాలంటూ ప్రజలను రెచ్చగొడుతోంది. ఇది అభివృద్ధి, సంక్షేమం ఎలా అవుతుందో చెప్పలేకపోతున్నారు. ఇలాంటి పథకాలపై ప్రజలే నిలదేసేలా చైతన్యవంతులు కావాలి. ప్రజలు చెమటోడ్చి కట్టిన పన్నుల డబ్బులను ఇలా దుబారా చేయడంపై నిలదేసే రోజులు రావాలి. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటుంటే.. పాలకులు అధికారం కోరుకుంటున్నారు. ఎంతకు తెగించి అయినా అధికారం లోకి రావడమే లక్ష్యంగా అనేకానేక ఉచిత పథకాలు, హామీలను గుప్పిస్తున్నారు. ఆదాయ వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న విన్యాసాలతో దేశ, రాష్ట్రాల ఆర్థిక ముఖచిత్రం మారిపోతోంది. అభివృద్ధి పడకేస్తోంది. నిరుద్యోగం పెరుగుతోంది. వస్తూత్పత్తి పడిపోతోంది. నిరంతరంగా ఏదో ఒక పథకం పేరుతో నగదు బదిలీలు జరుగుతున్నాయి. దీనికి కాంగ్రెస్, బీజేపీలతో పాటు ప్రాంతీయ పార్టీల నేతలంతా బరి తెగిస్తున్నారు.




## పేదల పేరు చెప్పి రాజకీయం..

75 ఏళ్లు దాటినా ఇంకా పేదల పేరు చెప్పి రాజకీయం చేస్తున్నారు. ఇలా నగదు బదిలీ పథకాలతో బొక్కసం గుల్ల చేస్తున్నారు. పేదరికం నుంచి ప్రజలను బయటపడేసే ఉద్దేశ్యంతో చేస్తున్న ఆర్భాటాలతో పథకాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అవుతున్నాయి. కొత్తగా ఉద్యోగాలు ఇవ్వగలిగే స్థితిలో ఉండడం లేదు. ఉపాధి, ఉద్యోగరంగాలను బలోపేతం చేసే చర్యలు చేయడం లేదు. అలాగే ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నా అందుకు అనుగుణంగా వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి ఆదుకోవడం లేదు. ఉన్న పరిశ్రమలను మూసేస్తున్నారు. లాభాల బాటలో ఉన్న సంస్థలను తెగనమ్మేస్తున్నారు. దేశంలో ప్రజలు అన్నమో రామచంద్రా అంటున్నా పట్టించుకోవడం లేదు. రైతుబంధు, ఉచిత విద్యుత్, ఉపాధిహామీ, కిలోరూపాయి బియ్యం లాంటి పథకాలన్నీ దండగ మారివే అయినా కొనసాగి స్తున్నారు.

## ప్రజలు అప్రమత్తం కావాలి.

గణతంత్ర వేడుకలు జరుపుకుంటున్న వేళ మార్పునకు నాంది ప్రస్తావన కావాలి. పేద ప్రజలకు తాము అధికారం లోకి వస్తే ఉచిత పథకాలతో లబ్దిచేకూరుస్తామని రాజకీయ పార్టీలు, నేతలు, ఎన్నికలవేళ చేస్తున్న వాగ్దానాల పట్ల ప్రజలు అప్రమత్తం కావాలి. ఉచిత వాగ్దానాలు సాధారణ బడ్జెట్‌ను మించి ఉంటున్నా యని, ఇలాంటి జనాకర్షక హామీలు గుప్పించడం తీవ్రమైన అంశమని గుర్తించాలి. గతంలో సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి అభిప్రాయమే వెలిబుచ్చింది. ఇక నుంచైనా ఉచిత వాగ్దానాల వర్షం కురిపించే రాజకీయ పక్షాలను, నేతలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారో నిలదీయాలి.

## ఆరు గ్యారెంటీల అమలు భారమే..

తెలంగాణలో ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించి ప్రభుత్వానికి అవకాశం లేదు. గత ప్రభుత్వం చేసిన అప్పుల నుంచి బయటపడడం ఎలా అన్నదే ప్రస్తుతం ఉన్న సమస్య. ఎన్నికలకు ముందు ప్రజానిధులతో ఉచిత తాయిలాలు ప్రకటిస్తూ, ఉచిత హామీలిస్తున్న పార్టీల ఎన్నికల గుర్తును స్తంభింపజేయాలని, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని గతంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అయినా ఎలాంటి చర్యా తీసుకోలేదు. త్వరలో పలు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల ముందు మరోమారు ఈ సమస్య చర్చ కావాలి. ఉచితాలపై ప్రజలే నిలదీయాలి. మనకెందుకులే అని అనుకుంటే మనలను నిండా ముంచుతారు. అందుకు తెలంగాణలో కేసీఆర్ ఏలుబడే చక్కటి ఉదాహరణ. ఏపీలో జగన్ పాలన కూడా అందుకు ఉదాహరణే. రాజకీయ పార్టీలు ఉచిత వాగ్దానాలతో ఓటర్లను ప్రలోభ పెడుతున్న తీరును ప్రజలు చైతన్యవంతులై ఎక్కడిక్కడ నిలదీయాలి. ఈ ఎన్నికల్లోపే ఇది చేయగలమా? వచ్చే ఎన్నికల వరకైనా చేయగలమా? అన్నది ఆలోచించాలి.

## బడ్జెట్‌ను మించిన ఉచితాల ఖర్చు..

ఉచిత హామీలకు అయ్యే ఖర్చు సాధారణ బడ్జెట్‌ను మించిపోతోందని గతంలో సుప్రీం సీజే గా పనిచేసిన జస్టిస్ ఎన్‌వీ రమణ చేసిన వ్యాఖ్యలు మననం చేసుకోవాలి. ఓటర్ల నుంచి రాజకీయ లబ్ది పొందటం కోసం అనుసరిస్తున్న జనాకర్షణ విధానాలు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. దీనిపై నిషేధం విధించాల్సి ఉంటుందని కూడా అప్పట్లో ఆయన అభిప్రాయపడ్డారు. ఇది చాలా తీవ్రమైన సమస్య అంటూ...మార్గదర్శకాలను రూపొందించాలని గతంలో ఎన్నికల సంఘానికి సూచించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం కూడా తనకు తాను నియమావళిని నిర్దేశించుకుని రాజకీయ పార్టీలను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. అధికారం కోసం... అధికార వనరులపై పెత్తనం కోసం రాజకీయ పార్టీలు చేస్తున్న విన్యాసాలే ఈ ఉచిత పథకాలుగా చెప్పుకోవాలి.

## అప్పుల కుప్పగా తెలంగాణ..

కేసీఆర్ కూడా అప్పులతో ఆస్తులు సృష్టించానని చెప్పి తెలంగాణను అప్పుల కుప్పగా తయారు చేశారు. ఈ అప్పులు తీర్చడానికి వేలకోట్లు వడ్డీలకే చెల్లించాల్సి రావడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి నేతలను నమ్మితే మనలను మనం అంగట్లో అమ్ముకోవడం తప్ప మరోటి కాదు. అధికారంలోకి రావడానికి పథకాలు ప్రకటించడం.. అధికారం లోకి వచ్చాక దానిని నిలుపుకోవడానికి నగదు బదిలీ పథకాలు ప్రవేశ పెట్టడం బాగా అలవాటు చేసుకున్నారు. ప్రజలు చెమటోడ్చి పన్నులు కడితే అభివృద్ధి పనులతో సంపదను సృష్టించాల్సిన నేతలు సంపదనలు హారతి కర్పూరంలా హరించి వేస్తున్నారు. మోడీతో సహా కేసీఆర్, జగన్, మమతా బెనర్జీ, కేజ్రీవాల్ లాంటి సీఎంలంతా ఇందుకు అతీతులు కాదు. ఏదో విధంగా అధికారాన్ని కాపాడు కోవాలన్న లక్ష్యంతో చేస్తున్న పథకాల కారణంగా ప్రజలు నష్టపోతున్నారు. విద్య, వైద్యం అందకుండా పోతోంది. రవాణా మార్గాలు నేటికీ అభివృద్ధి జరగడం లేదు. ఎన్నికలు వచ్చినపుడల్లా కొత్తకొత్త ఉచిత పథకాలు వచ్చి చేరుతున్నాయి. ఖర్చుల భారం పెరగ డంతో ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసేస్తున్నారు. అదేమంటే అభివృద్ధికి అప్పులు తప్పవంటున్నారు. దేశవ్యాప్తంగా నడుస్తున్న ఉచిత పథకాల వ్యాప్తిని చక్కదిద్దేందుకు చర్చించాలి. రాజకీయ పార్టీలను నిలదీయాలి. లేకుంటే వారు మనలను అప్పులకు బాధ్యులుగా చేయగల సమర్థులు.

# ఠాకూర్‌కు భారతరత్న ప్రతి ఒక్కరికీ గర్వకారణం

**జన నాయకుడికి విశిష్ట గౌరవం ఇచ్చిన కేంద్రం**

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసి.. జన నాయకుడిగా పేరు తెచ్చుకున్న దివంగత బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూర్ ఠాకూర్ కు ఆయన శత జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డు ప్రకటించడం ప్రతీ ఒక్కరూ గర్వించే విషయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ అన్నారు. భారత రత్న ప్రకటించిన సందర్భంగా శనివారం వరంగల్ చౌరస్తాలో నాయీ బ్రాహ్మణ జిల్లా అధ్యక్షుడు ఎలగంటి సతీష్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పుష్పాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి గంట రవి కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఠాకూర్ బీహార్ లో కాంగ్రెసేతర తొలి ముఖ్య మంత్రిగా చరిత్ర సృష్టించారని అన్నారు. కార్పూర్ ఠాకూర్ సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేశారని రవి కుమార్ తెలిపారు. ఓబీసీలకు ఏకంగా 26శాతం రిజర్వేషన్ కల్పించి సామాజిక, ఆర్థిక అభివృద్ధి కి కృషి చేసినట్టు తెలిపారు. ఓబీసీ అభ్యున్నతికి ఠాకూర్ పోరాటం మూలంగానే 90వ దశకంలో మండల్ కమిషన్ సిఫార్సుకు బీజం వేసిందన్నారు. దేశంలో ఏర్పడిన ఎమర్జన్సీ పీరియడ్ లో జయప్రకాశ్ నారాయణ్ తో కలిసి కర్పూ ర్ ఠాకూర్ ఉద్యమాన్ని నడిపిన ఘన చరిత్ర ఉందన్నారు. ఇదిలా ఉంటే ఠాకూర్ జయంతి సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ రూ.100 నాణెంను విడుదల చేయడం ఆనందంగా ఉందని రవికుమార్ తెలిపారు. ఆయన సేవలను గుర్తించి వరంగల్ నాయీ బ్రాహ్మణులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు.

## నాయీ బ్రాహ్మణులను గుర్తించిన కేంద్రం: సతీష్

జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎలకంటి సతీష్ మాట్లాడుతూ ఠాకూర్ కు అవార్డు ప్రకటిచించడంపై జిల్లా నాయీ బ్రాహ్మణుల తరపున ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. బీసీ కులంలో అట్టడుగున ఉన్న నాయీ బ్రాహ్మణ వ్యక్తి ఠాకూర్ కు కేంద్రం పెద్ద పీట వేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తామంతా ప్రధాని వెన్నంటే ఉంటామని తెలిపారు. ఈ మేరకు ముఖ్య అతిథిగా విచ్చేసిన బిజెపి జిల్లా అద్యకుడు గంట రవి కుమార్ కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీరాముల మురళి మనోహర్, కొలనుపాక కుమార స్వామి, నాగవెల్లి సునీల్ కుమార్, సింగరపు రమేష్, సతీష్, నాగరాజు, వేణు, సాంబమూర్తి, శ్రీను, వాసు, రాజు, బాలు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, చీటురి అశోక్, ఓబీసీ స్టేట్ సెల్ కన్వీనర్ శ్రీరాములు మురళీమనోహర్, యువ మోర్చా నాయకులు నాగవెల్లి సునీల్, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, గాడెపెల్లి రాజేశ్వర్, తూర్పు నియోజకవర్గ కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ గుప్తా, ఉపాధ్యక్షుడు కనకుంట్ల రంజిత్, ఎస్సీ మోర్చా నాయకులు బన్న ప్రభాకర్, మాదాసు రాజు, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు గోకె వెంకటేష్, డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో అన్నారు. శనివారం జిల్లా కేంద్ర గ్రంధాలయంలో గ్రంథాలయ కార్యదర్శి అధ్యక్షతన కమిటీ సభ్యులతో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయాలను పాఠకులకు అనుకూలంగా సౌకర్యాలు కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రధానంగా అత్యవసరమైన సీసీ కెమెరాలు, ఇన్వర్టర్ వంటివి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బుక్ ఫెయిర్ వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని సెక్రటరీని ఆదేశించారు. గ్రంథాలయాలు చిన్నారులకు చేరువ చేసేలా విజ్ఞానాన్ని వినోదాన్ని పంచే పుస్తకాలను ఏర్పాటు చేసి వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, వయోజన విద్య ఉమ్మడి జిల్లాల అధికారి జై శంకర్, జిల్లా పౌర సంబంధాల అధికారి శ్రీనివాసరావు, గ్రంథాలయ కార్యదర్శి శ్రీలత, లైబ్రేరియన్లు వీరేందర్ పాల్గొన్నారు.

## రమేష్‌కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎస్పీ చేతుల మీదుగా ఉత్తమ సేవా పథకం పొందిన జీ రమేష్ కు శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు ఆధ్వర్యంలో శనివారం జి రమేష్ ను శాలువా షీల్డ్ తో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా బత్తుల రమేష్ బాబు మాట్లాడుతూ ఇంకా ఎన్నో అవార్డులు పొందాలని, ఉన్నతమైన పదవులను పొందాలని కోరారు. ఈ కార్యక్రమం లో శ్రీభక్త మార్కండేయ సంక్షేమ సంఘం కార్యవర్గం సభ్యులు నరేందర్, నరెట్ల మహేందర్, గంజి రాజేందర్, తేరాల శ్రీధర్, బత్తుల మహేష్, కూరపాటి శ్రీనివాస్, కూచన సురేష్, కొంగ సారంగపాణి, డి.నవీన్, చెన్నూరి రాజు, తదిరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి ఓఎస్డీని కలిసిన ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఓఎస్డీగా నియమితులైన సత్యనారాయణను వారి నివాసంలో శనివారం తెలంగాణ ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఓఎస్డీగా నియమితులైనందున సత్యనారాయణకు ఆర్టీఐ బృందంతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంటి ముదిరాజ్ మాట్లాడుతూ ఆర్టీఐ చట్టం గురించి వివరించి ప్రభుత్వంలో ఎక్కడ అవినీతి ఉంటే అక్కడ ఆర్టీఐ చట్టం పోరాటం చేస్తుందని వివరించారు. ఓఎస్డీ దీనికి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం-2005 అనేది ప్రతి పబ్లిక్ అథారిటీ పనిలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి, ప్రభుత్వ అధికారుల నియంత్రణలో సమాచారాన్ని పొందేందుకు పౌరులకు సమాచార హక్కు ఆచరణాత్మక పాలనను ఏర్పాటు చేయడానికి ఒక చట్టం అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్రవంతి, బబ్లూ, భోగం విష్ణు, అఖిల పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, పరకాల :** రేగొండ మండలం దమ్మన్నపేట గ్రామంలో పద్మశాలి కుల బాంధవుడు నిరుపేద కుటుంబానికి చెందిన వలస కృష్ణ అనే వ్యక్తి అనారోగ్యం తో బాధపడుతూ అకాల మరణం చెందారు. వారికి సహాయం చేయాలన్న ఆలోచనతో పరకాల మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి వారికి 50కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అతడి భార్య వలస అనిత, కుమారుడు చరణ్, తల్లి చంద్రకళ, పుట్ట రవీందర్, దాసరి రవి, కోర్ర నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

**బాలుడికి మెదడులో రక్తం స్రావం**

**ఆపరేషన్‌కు భారీగా ఖర్చు**

**దాతలు సాయం చేయాలని కోరుతున్న తల్లిదండ్రులు**



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** కుటుంబ పెద్ద మరణించి తొమ్మిది రోజులు గడుస్తుండగానే ఆ కుటుంబంలో మళ్లీ విషాదం అలుముకొంది. ములుగు జిల్లా వల్వాయి మండల కేంద్రంలో మౌనిక నాగరాజుల దంపతులకు ఇద్దరు కవల పిల్లలు. ఆ ఇద్దరు కలిసి సాయంకాలం సమయంలో ఆడుకుంటుండగా నేలపై పడడంతో తలకు గాయం ఏర్పడింది. వెంటనే స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ ప్రథమ చికిత్స అందించి బాబుకి చాలా ప్రమాదంగా ఉందని, వెంటనే వరంగల్ లోని పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లండని చెప్పగా ఆ పిల్లవాడిని హుటాహుటిన హనుమకొండలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షలు చేసిన అనంతరం డాక్టర్లు మెదడులో రక్తం స్రవిస్తుందని అబ్బాయికి చాలా ఇబ్బందులు



ఉన్నాయని, వెంటనే శస్త్ర చికిత్స చేయాలనడంతో వారి వద్ద ఉన్న డబ్బుతో పాటు కొంతమంది దాతల సహకారంతో ఆపరేషన్ చేయించారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ అబ్బాయి కృత్రిమ శ్వాసతో ఉన్నాడని, సుమారు రోజుకు 60 నుంచి 70 వేల రూపాయల వరకు ఖర్చు రావడంతో చేసేది లేక తల్లిదండ్రులు ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఈరోజు హనుమకొండ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మణ్ తల్లి, బంధువులు మాట్లాడుతూ దాతలు తోచిన సహాయం చేసి మా కుమారుడికి ప్రాణ భిక్ష పెట్టాలని వేడుకున్నారు. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి సహాయం చేయాలనుకున్న వారు **80089 94920, 99631 74160** ఈ నెంబర్లకు ఫోన్ పే ద్వారా సహాయం అందించవచ్చని వారు కోరుతున్నారు.

## ప్రశ్నే ప్రగతికి సోపానం



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ధర్మసాగర్ మండల స్థాయి చెకుముకి సైన్సు ప్రతిభాపాటవ పోటీలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన వైజ్ఞానిక సదస్సులో రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక పర్యావరణ విభాగం కన్వీనర్ ధర్మ ప్రకాష్ కీలక ఉపన్యాసం చేస్తూ పాఠశాల దశ విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, సైన్స్ పద్ధతిలో జీవించాలని, అందివచ్చే ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని శాస్త్ర,సాంకేతిక రంగాల ఫలాలను పుచ్చుకొని మెరుగైన జీవితం గడపాలన్నారు. మహమ్మద్ మాట్లాడుతూ ప్రతిభాపాటవ పోటీలు విద్యార్థులలో వైజ్ఞానిక స్పృహలు పెంపొందించి క్రమశిక్షణను అలవరుస్తాయన్నారు. తదనంతరం నిర్వహించిన గ్రూప్ క్విజ్‌లో ప్రభుత్వ ఆంగ్ల విభాగంలో జిల్లాపరిషత్ బాలికల పాఠశాల ధర్మసాగర్, జిల్లా పరిషత్ పాఠశాల పెద్ద పెండ్యాల సంయుక్తంగా ప్రథమ బహుమతిని పొందారు. ద్వితీయ బహుమతిని జిల్లా పరిషత్ పాఠశాల సాయిపేట, తృతీయ బహుమతి జిల్లా పరిషత్ పాఠశాల దేవు క్రైవసం చేసుకున్నారు. ప్రైవేట్ విభాగంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రథమ, శ్రీనివాస రామానుజన్ స్కూల్ ద్వితీయ, సెయింట్ మ్యాథ్యూస్ పాఠశాల తృతీయ బహుమతిని పొందారు. వివిధ పాఠశాలల సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.

## ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు**



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తొర్రూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో తొర్రూర్ జూనియర్ కళాశాలలో సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులను మోసం చేసిందన్నారు. ప్రభుత్వం కళాశాలకు సరైన భవనం లేక తీవ్ర ఇబ్బందిగా మారింది అన్నారు. భవనం శిధిలావస్థలో ఉండడం వలన విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ చదువుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు విద్యార్థులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. విద్యార్థులు అందరూ ఎస్ఎఫ్ఐ సభ్యత్వం తీసుకొని విద్యార్థుల సమస్యలు పరిష్కార పోరాటంలో ముందుండాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్, నరేష్, మహేష్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తా

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని కౌకొండ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ సీడీపీ నిధుల నుంచి రూ. 26లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని శనివారం పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారి గ్రామానికి వచ్చిన రేవూరి ప్రకాష్ రెడ్డికి గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు ఆయనను శాలువాలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిందని, రాష్ట్ర వాస్తవ ఆర్థిక పరిస్థితిని ప్రజల ముందు పెట్టి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రజల సహకారంతో గ్రామాల అభివృద్ధితో పాటు, ప్రజల ఆర్థిక సామాజిక అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత క్రమంలో నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలైన అంతర్గత రోడ్లు, గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం, బలహీన వర్గాలకు ఆర్థిక సహాయం, హైటెన్షన్ విద్యుత్ లైన్ వల్ల పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని గ్రామస్తులకు ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల రమేష్, ఎంపీటీసీ మేకల సతీష్, నడికూడ జడ్పీటీసీ కొడపాక సుమలత కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# బీసీల హక్కుల సాధనకు పోరాటం చేస్తాం

## రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు నాయిని భరత్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీసీల బడుగు బలహీన వర్గాల కోసమే తెలంగాణ రాష్ట్ర బీసీ ప్రజాసంఘం స్థాపించబడిందని రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు నాయిని భరత్ అన్నారు. వరంగల్ నగరంలోని ఏఎస్ఎమ్ కళాశాల వద్ద తెలంగాణ రాష్ట్ర బీసీ ప్రజా సంఘం నూతన కార్యాలయాన్ని అధ్యక్షుడు భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలలో బీసీ ప్రజా సంఘం యొక్క పదవీ బాధ్యతల పత్రాలను అధ్యక్షుడు నాయిని భరత్ అందజేశారు .ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భారత్ మాట్లాడుతూ బీసీలకు అన్ని రంగాలలో అన్యాయం జరుగుతుందని, బీసీల కుల గణన చేసి బీసీలకు న్యాయం చేయాలని భరత్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటులో బీసీల పాత్ర కీలకంగా నిలిచిందని, బీసీలకు రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పదవులను ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణనను పట్టించుకోవడం లేదని ఎన్నో ఏళ్లుగా బీసీ కుల గణన వెనకబడిపోయిందని తెలియజేశారు. కాబట్టి తెలంగాణ రాష్ట్ర బీసీ ప్రజాసంఘం వేదికగా బీసీల హక్కుల కోసం పోరాటం చేస్తామని భరత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేటలో ఎలక్ట్రీషన్ల బైక్ ర్యాలీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రైవేట్ ఎలక్ట్రిషన్ అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల జక్సన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా కాజీపేట్ చౌరస్తా నుంచి డీజిల్ కాలనీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాజీపేట ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సిరిల్ లారెన్స్ ఎలక్ట్రీషియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సిరిల్ లారెన్స్ మాట్లాడుతూ "థామస్ అల్వా ఎడిసిన్ "మానవ జాతి ని ప్రభావితం చేసిన "విద్యుత్ బల్బ్ "ఫోనోగ్రాప్ "లాంటి అనేక ఉపకారణాలను రూపొందించిన ఒక గొప్ప అమెరికన్ శాస్త్రవేత్త, వ్యాపారవేత్త అని కొనియాడారు. అలాగే ఎలక్ట్రీషియన్ వర్క్ చేసేటప్పుడు జాగ్రత్త గా పని చేయాలన్నారు. అలాగే వ్యక్తిగత ఇన్సూరెన్స్ కలిగి ఉండవలేనని, ఎలక్ట్రీషియన్ వర్కర్లు తమ కష్ట, నష్టాలను తన దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దృష్టికి తీసుకొని పోయి వాటిని పరిష్కరించుటకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బి.శేషాద్రి, సీహెచ్ భాస్కర్, జె కుమార్, డి సురేష్ కుమార్, రిజువాన్, గోపి, స్వామి, లింగస్వామి, మహమూద్, మీరాషేక్, ప్రసాద్, రవికుమార్, మోసెస్, రహీం, నాగరాజు, అమర్నాథ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలే

### పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం ఫతేపురం, మడిపల్లి గ్రామాలలో నూతన గ్రామపంచాయతీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలే కాబట్టి, గ్రామాన్ని అభివృద్ధి చేసుకునే బాధ్యత మన అందరి మీద ఉందని, రాష్ట్రాన్ని నడిపించడంలో సచివాలయం ఎంత కీలకపాత్ర పోషిస్తుందో, గ్రామాన్ని నడిపించడంలో కూడా గ్రామపంచాయతీ అంత కీలక పాత్ర పోషిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను లబ్ధిదారులకు అందే విధంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు చూడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో ఇచ్చిన మాట ప్రకారం రెండు గ్యారెంటీ అమలు చేశామని, రాబోయే రోజుల్లో మరిన్ని గ్యారెంటీలను కూడా అమలు చేసి మాట నిలబెట్టుకుంటామన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఉన్న ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తాను కట్టుబడి ఉంటానని, వారు ఏ సమస్య ఉన్న తనను నేరుగా కలవవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జి ఝాన్సీ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు మంగళపల్లి శ్రీనివాస్, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, వైస్ ఎంపీపీ ఇట్టే శ్యాంసుందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ కుమార్ , గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, రేగొండ :** మృతుల కుటుంబాలకు ఎల్లపుడు అండగా ఉంటామని కాంగ్రెస్ నాయకులు పున్నం రవి భరోసానిచ్చారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఉమ్మడి రేగొండ మండలం గోరికొత్తపల్లి మండలం చిన్నకోడేపాక గ్రామంలో ఎంపీటీసీ జూపాక రమేష్ తల్లి జూపాక రాజమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మృతుల కుటుంబాలను పరామర్శించి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ కటంకూరి మనోహర్ రెడ్డి, రేగొండ మాజీ ఎంపీటీసీ పట్టెం శంకర్, గ్రామ కమిటీ అధ్యక్షులు పంగ ఐలయ్య, మేకల సాంబయ్య, జక్కుల సాంబయ్య, దిలీప్, గణేష్, రాజు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండల న్యాయ సేవా సంస్థ తొర్రూరు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అమ్మాపురంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి, చైర్మన్ మండల న్యాయ సేవా సంస్థ మట్ట సరిత ప్రసంగిస్తూ విద్యార్థినీ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులు విద్యార్థినిలు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, వాహనాలు మద్యం సేవించి నడిపితే నేరమని వివరించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు కె.వీరన్న, తొర్రూరు సర్కిల్ ఇన్ స్పెక్టర్ వై సత్యనారాయణ, రిటైనర్ లాయర్ గణపురం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## దివ్యాంగుల, వృద్ధుల ప్రత్యేక ప్రజావాణి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కలెక్టర్ కార్యాలయంలో శనివారం దివ్యాంగుల, వృద్ధుల ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాఖేడే వినతులు స్వీకరించారు.

## ఘనంగా ఎలక్ట్రీషన్ దినోత్సవం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో ఘనంగా ఎలక్ట్రిషన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం వెలుగు ప్రైవేట్ ఎలక్ట్రిషన్ టెక్నీషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కరెంట్ బల్బును కనిపెట్టిన థామస్ అల్వా ఎడిషన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అసోషియన్ జెండాను ఎగర వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెలుగు ప్రైవేట్ ఎలక్ట్రిషన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకునూరి రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఉమర్, ఉపాధ్యక్షుడు రాంచందర్, కార్యదర్శి సూర రఘు, సలహాదారులు పైండ్ల సమ్మయ్య, నాయకులు మామిడి మహేందర్, బీరెల్లి రాజేందర్, రవీందర్ తారక్, సుర హరీష్, శివప్రసాద్, మనోహర్, సాంబరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట పట్టణం, 62వ డివిజన్ సోమిడి ఎస్సీ కాలనీ కమిటీ హాల్ వద్ద రూ.5లక్షల జనరల్ ఫండ్ తో ఎస్సీ కాలనీ కమిటీ హాల్ కాంపౌండ్, సీసీ రోడ్, ప్యాచ్ వర్క్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీవాసులతో కలసి ఎస్సీ కాలనీని సందర్శించి, త్వరలో నూతన ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటుతో పాటు కాలనీని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జక్కుల రవీందర్ మాట్లాడుతూ డివిజన్ లో అనేక రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, డివిజన్ అభివృద్ధే ఏకైక లక్ష్యమని, 62వ డివిజన్ ని ఆదర్శ డివిజన్ గా తీర్చిదిద్దుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మెరుగు రాజయ్యయాదవ్, డాక్టర్ శ్రావణ్, దాడబోయిన వీరస్వామి, మాచర్ల జయకర్, నీల, బండారి సురేందర్, రవికుమార్, కుమ్మరి స్వామి, తిప్పారపు మల్లేష్, మంద కుమారస్వామి, సాంబరాజు, జైజైరావు, నాగరాజు, ప్రసన్న లత, శ్రీను, బైరబోయిన రమేష్, దొంగల కుమార్, శివరాం, కూకట్ల రమేష్, అశోక్, జగన్నాచారి, రవీంద్ర చారి, రవికుమార్, బొంద్యాల్, యాసిన్, నవీన్, చిన్న, రేవంత్, ఆల్ వింగ్ ఆఫీసర్లు, ఎస్సీ కాలనీ పెద్దలు, స్థానిక మహిళలు, ఎస్సీ కాలనీ యూత్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ దిడ్డి శ్రవణ్‌కు పలువురి అభినందన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని సంరక్ష హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ,ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ దిడ్డి శ్రవణ్ కుమార్ కు 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, మునిసిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా చేతుల మీదుగా ఉత్తమ వైద్య సేవా అవార్డు ను అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి శ్రవణ్ శనివారం మాట్లాడుతూ ఈ అవార్డు వలన భాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. డాక్టర్ శ్రవణ్ కు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ వైద్య సేవా అవార్డు రావడం పట్ల పలువురు డాక్టర్లు, డాక్టర్ దొడ్డా రమేశ్ కుమార్, డాక్టర్ అజిత్ మొహమ్మద్, డాక్టర్ తిరుపతి రెడ్డి, డాక్టర్ పోలా నటరాజ్, డాక్టర్ బందెల మోహన్ రావు, డాక్టర్ దినేశ్, డాక్టర్ లక్ష్మీ నారాయణ, డాక్టర్ ప్రసాద్ రెడ్డి, డాక్టర్ రాంచందర్ ధరక్, డాక్టర్ రవి, డాక్టర్ కస్తూరి ప్రమీల, డాక్టర్ లక్ష్మి దీపక్, డాక్టర్ శ్రవణ్ ఆర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మహేందర్ హర్షం వ్యక్తపరుస్తూ అభినందనలు తెలిపారు.

# ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

## భూపాలపల్లి డీఎస్పీ రాములు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ఆటో డ్రైవర్లు, ఆటోలను నడిపే సమయంలో తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని భూపాలపల్లి డీఎస్పీ ఏ.రాములు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని భూపాలపల్లి ఎస్ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయగా భూపాలపల్లి డీఎస్పీ ఏ.రాములు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్ నుంచి జయశంకర్ విగ్రహం వరకు ఆటోలలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఆటోలను నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. తమ వెనక కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారని, గుర్తుపెట్టుకుని ఆటోలు సురక్షితంగా నడుపుకోవాలన్నారు. లైసెన్స్‌లు తప్పకుండా తీసుకోవాలన్నారు. తాగి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ఆటోలను నడపాలని, ఆటో రిజిస్ట్రేషన్ నెంబర్ కనబడేలా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డీఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎస్ఐ శ్రావణ్, భూపాలపల్లి ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, ఆటో యూనియన్ నేతలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చెకుముకి పోటీలు



**వరంగల్ వాయిస్, కాటారం :** మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు చెకుముకి సైన్స్ పోటీలు శనివారం కాటారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రభుత్వ విభాగంలో నిర్వహించిన పోటీలలో దామెరకుంట సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల ప్రథమ స్థాయిలో నిలువగా, ద్వితీయ స్థాయిలో చింతకాని జడ్పీహెచ్ఎస్, తృతీయ స్థాయిలో కాటారం గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలు విజేతలుగా నిలిచారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో నిర్వహించిన పోటీలలో ప్రథమ స్థాయి కాటారంకు చెందిన ఆదర్శ పాఠశాల, ద్వితీయ స్థాయిలో కాటారంకు చెందిన కేంబ్రిడ్జ్ పాఠశాల, తృతీయ స్థాయిలో కాటారంకు చెందిన వివేకానంద పాఠశాలలు నిలిచినవి. ఈ కార్యక్రమంలో కాటారం జడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు సమ్మయ్య, రాజబాబు, శ్రీనివాస్, సుధాకర్, కుమారస్వామి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే నాయిని ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 58వ డివిజన్ 100 ఫీట్ల రోడ్డులో ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా గెలిచి మొదటి సారిగా దేవాలయానికి వచ్చిన సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డికి పట్టు వస్త్రాలు పెట్టి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏ.నాగరాజు, డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు అనుకోటి పున్నం, కోటేశ్వర్ రావు, తాళ్లపల్లి రవీందర్ (జేకే), మండల సమ్మయ్య, రాజేశ్వర్ రావు, తాళ్లపల్లి మేరీ, మాట్టేపల్లి మోహన్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** జాతీయ జెండా పేరుతో వసూళ్లకు పాల్పడిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించే అర్హత లేదని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్ విమర్శించారు. శనివారం డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దయాకర్ రావు మంత్రిగా ఉన్న సమయంలో కొంతమంది బీఆర్ఎస్ నాయకులు జడ్పీఎస్ఎస్ పాఠశాలలో 100అడుగుల జాతీయ జెండా ఏర్పాటు, దసరా ఉత్సవాల పేరుతో వ్యాపారస్తుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి ఏర్పాటు చేశారని, ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణకు బీఆర్ఎస్ నాయకులు ప్రోటోకాల్ పాటించకుండా దౌర్జన్యంగా జాతీయ జెండా ఎగరవేసి ప్రయత్నం చేశారని అన్నారు. ప్రభుత్వ భూమిలో జెండా ఏర్పాటు చేసి అధికారికంగా ఆవిష్కరించాల్సిన జెండాను ప్రైవేట్ వ్యక్తులు ఎగరవేసి ప్రయత్నం చేశారని, అధికార పార్టీ ఎమ్మెల్యేకు, అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించడం సిగ్గుచేటనారు. జడ్పీటీసీ, ఎంపీపీలు దళితులమని మాట్లాడుతున్నారని జెండా ఎగరవేసేందుకు హాజరైన డాక్టర్ సోమేశ్వరరావు దళితుడా అని ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల్లో అధికారులకు మాత్రమే జెండా ఎగరవేసే అధికారం ఉంటుందన్నారు. తాజాగా మున్సిపాలిటీలో జరిగిన సమావేశంలో అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా ఎమ్మెల్యేకు చివరి కుర్చీ ఇవ్వడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉన్నామనే మతిలో ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఇలాంటి చౌకబారు ప్రకటనలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెదగాని సోమయ్య, ఎనగందుల మురళి, చెవిటి సధాకర్, ధర్మారపు మహేందర్, బచ్చలి లక్ష్మణ్, సోమిరెడ్డి, బి.వెంకన్న యాదవ్, బానోత్ సాగర్, దేవుడు నాయక్, యూత్ పట్టణ అధ్యక్షుడు బసనబోయిన మహేష్ యాదవ్, బానోత్ కృష్ణ, త్యాగరాజు, మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ సమానమైన విద్యను అందించాలి

## టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్ గౌడ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ ప్రోగ్రెస్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్ ను ఆర్య బాలుర ఉన్నత పాఠశాల ఖిలా వరంగల్ మధ్య కోటలో టీపీటీఎఫ్ ఖిలా వరంగల్ మండల అధ్యక్షుడు బెల్లంకొండ పూర్ణచందర్ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన పూజారి మనోజ్ గౌడ్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే అందరికి సమానమైన విద్య అందించినప్పుడు మాత్రమే రాజ్యాంగం ఆశించిన సమ సమాజ నిర్మాణం సాధ్యపడుతుందని అన్నారు. విద్యా రంగంలో ఉన్న అనేక సమస్యల పరిష్కారం కోసం టీపీటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఖమ్మంలో ఫిబ్రవరి నెల 11, 12లలో జరిగే మహాసభలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రధానోపాధ్యాయుడు వి.రవి, టి.నరేందర్, కే.సునీత, ఎం ఉషారాణి, ఎన్.జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాతృదేవోభవ వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ గౌతమి నగర్ డాక్టర్స్ కాలనీలో గల లోటస్ నేషనల్ స్కూల్ లో మాతృదేవోభవ వేడుకలను ప్రిన్సిపల్ జానకి దేవి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అగ్రికల్చరల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సల్లా సౌజన్య విద్యార్థులకు మాతృమూర్తి యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తూ విద్యార్థుల సృజనాత్మకత శైలిని పెంపొందించే విధంగా వారి ప్రతిభను గుర్తించి అందులో రాణించేలా తల్లిదండ్రులు సహకరించాలని తెలియజేశారు. అనంతరం విద్యార్థుల మాతృమూర్తులు వివిధ రకాల వంటలు ఆటలపోటీల్లో పాల్గొన్నారు.

# అనాథ పిల్లలకు నిత్యావసరాల పంపిణీ



**వరంగల్ వాయిస్, మామునూర్ :** నాలుగో పటాలం"ఏ"కాయ్" అన్యువల్ రిఫ్రెషర్ కోర్స్"లో భాగంగా నాలుగో బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి ఆదేశానుసారం శనివారం లక్ష్మీపురంలో గల "న్యూ లైఫ్ సొసైటీ బాల బాలికల అనాథాశ్రమం" సందర్శించి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజిరెడ్డి పాల్గొని పిల్లల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఆశ్రమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్షేత్ర స్థాయిలో కమిషనర్ రిజ్వాన్ బాషా పర్యటన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వివిధ డివిజన్ లలో అభివృద్ధి పనులు పూర్తయిన క్రమంలో బిల్లుల చెల్లింపుల కోసం కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా శనివారం నగరం లోని పలు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి పనుల తీరును, నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భం గా బల్దియా పరిధి 4వ డివిజన్ లోగల యాదవ నగర్, లోటస్ కాలనీ, 2వ డివిజన్ లోని విజయ లక్ష్మి కాలనీ, 56వ డివిజన్ లోనీ జవహర్ కాలనీ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్ లను కమిషనర్ పరిశీలించి నిర్మాణ సంబంధ అంశాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని చేపట్టిన పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ రవికుమార్, ఏఈలు హరికుమార్, ఆర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి సామాజిక శాస్త్రవేత్త

## తహసీల్దార్ సైదులు

**వరంగల్ వాయిస్, మరిపెడ :** ప్రతి విద్యార్థి సామాజిక శాస్త్రవేత్తలని మరిపెడ తహసీల్దార్ సైదులు అన్నారు. చెకుముకి మండల స్థాయి సైన్స్ సంబరాలలో పలువురు చెకుముకి మండల స్థాయి సైన్ సంబరాలు మరిపెడ మండల అధ్యక్షుడు బయగాని రామ్మోహన్ అధ్యక్షతన స్థానిక కనకదుర్గ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు వక్తలు మరిపెడ మండల స్థాయి చెకుముకి పోటీ పరీక్షల సమయంలో ముఖ్య అతిథిగా హాజరైన మండల తహసిల్దార్ సైదులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శాస్త్రీయ అవగాహనను కలిగి ఉండి ప్రతి ప్రశ్నకు శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఏజే రామారావు మాట్లాడుతూ రాజ్యాంగంలోని 51ఏహెచ్ ఆర్టికల్ ప్రకారం ప్రతి ఒక్కరూ శాస్త్రీ అవగాహనని, శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. సీతారాంపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మందాటి రామచంద్రు మాట్లాడుతూ పరీక్షలు అంటే భయాన్ని వీడి, ఆహ్లాదంగా ఎలా రాయాలో చెకుముకి నేర్పిస్తుందన్నారు. పిల్లలకు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టే విధంగా చెకుముకి నిర్వహిస్తున్న జేవీవీ బాధ్యులను అభినందించారు. చెకుముకి సైన్స్ సంబరాల కన్వీనర్ షేక్ సుభాని మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో మండల వ్యాప్తంగా 1700 మంది విద్యార్థులు హాజరుకాగా, అందులో నుంచి మండల స్థాయికి 72మంది విద్యార్థులు ఎన్నికయ్యారన్నారు. మున్సిపల్ కమిషనర్ ఏ.రాజు, ఎస్సై షేక్ తాహెర్ బాబా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా



ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దయానంద్, ప్రధానోపాధ్యాయులు మురళీ కృష్ణ, శశిధర్, జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకులు సాహితీ శ్రీనివాస్, మహబూబాబాద్ జిల్లా రాచకొండ రామచంద్రు, దీకుంట్ల వెంకన్న, జనార్ధన్, మంగు, వెంకన్న, రాము, రాజకుమారి, విద్యార్థినీ విద్యార్థులు, పాఠశాలల గైడ్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన పాఠశాలలు ఇవే. ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం విభాగం నుంచి టీఎస్ మోడల్ స్కూల్, మరిపెడ ప్రభుత్వ తెలుగు మీడియం విభాగం నుంచి జడ్పీహెచ్ఎస్ వీరారం హైస్కూల్, ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం విభాగం నుంచి గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్ ఎంపికయ్యాయి. కాగా జిల్లా స్థాయి పోటీకి ఎంపికైన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లని, మెమొంటోలని ప్రముఖ వ్యాపారవేత్త దారం నాగేశ్వరరావు గారి సహకారంతో అందజేశారు. టీములు ఫిబ్రవరి 3న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే జిల్లా స్థాయి చెకుముకి పరీక్షలకు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

## జాతీయ స్థాయి పోటీలకు రామప్ప జూనియర్ కళాశాల విద్యార్థులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రామప్ప జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు విక్రమ్ రెడ్డి, సిద్ధార్థ, రక్షిత జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్, సెక్రటరీ ఐలి కర్ణాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 01వరకు చత్తీస్ గఢ్ రాష్ట్రంలోని కోర్బాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నట్టు తెలిపారు. గత నెల మహబూబాబాద్ తొర్రూరులో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచినట్టు పేర్కొన్నారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను కోచ్ వినయ్, సతీష్, ఫిజికల్ డైరెక్టర్ కమల్, కళాశాల అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

## మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్యే నాయినితో డాక్టర్ రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మార్నింగ్ వాకర్స్ తో శనివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో పాటు వరంగల్ ఎంపీ ఆస్పిరెంట్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ వాకర్స్ ను కలిసి వారితో వాకింగ్ లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రజా సమస్యల మీద వాకర్స్ తో మాట్లాడి పరిస్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, పులి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ..

హనుమకొండ 6వ డివిజన్‌లో సిద్ధి వినాయక వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డైమండ్ ఫంక్షన్ హాల్ లో శనివారం నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి-నాయిని నీలిమా రెడ్డి దంపతులు హాజరై నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు.

## విద్యార్థులకు బహుమతుల అందజేత



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణతంత్ర దినోత్సవ సందర్భంగా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు కాళేశ్వరం ఎంపీటీసీ రేవెల్లి మమత నాగరాజు బహుమతులు అందజేశారు. మాజీ పాఠశాల వైస్ చైర్మన్ బందెల రాజేశ్వరి జ్ఞాపకార్థం వారి కుమారుడు బందెల బన్నీ (వెంకటేష్)సుమారు 200 బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న విద్యార్థి విద్యార్థులకు ఉదయం సాయంత్రం స్నాక్ అందించి మంచి మనసు చాటుకొని మళ్లీ 200బహుమతులు అందజేయడం అభినందనీయమని అన్నారు. ఇంత చిన్న వయసులో సేవా భావం కలిగి ఉండడం సంతోషకరమని కొనియాడారు. భవిష్యత్తులో మరింత సేవ చేయాలని కోరుకున్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్యం దిశగా ప్రయాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు నాగుర్ల పరామర్శ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్కపల్లె గ్రామానికి చెందిన కోడెం సరోజన ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, మాజీ తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పరామర్శించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎడ్లపల్లి రాజయ్య కుమారుడు నరేష్ ను పరామర్శించారు. వారి వెంట తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, గ్రామ సర్పంచ్ తిప్పర్తి సాంబరెడ్డి, ఉపసర్పంచ్ ధర్మారావు, హనుమకొండ జిల్లా ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్ రావు, నాగుర్ల బాపురావు, దేవేందర్, మోర్తల దేవేందర్, సూరవు కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కోదండరామ్ ఎమ్మెల్సీగా ఎన్నికవడం హర్షనీయం



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా తెలంగాణ ఉద్యమ నాయకుడు ప్రొఫెసర్ కోదండరామ్ నియామకం పట్ల హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా హైదరాబాదులోని తన నివాసంలో హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి జేఏసీ నాయకులు కవ్వ లక్ష్మారెడ్డి, డేగల సారయ్య, ప్రొఫెసర్ వీరన్న నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి హుస్నాబాద్ లో త్వరలో నిర్వహించే మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండ రామ్ ఆత్మీయ అభినందన సభకు హాజరు కావలసిందిగా కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జేఏసీ నాయకులు డాక్టర్ ఎదులాపురం తిరుపతి, చెప్యాల ప్రకాష్ కూరపాటి నాగరాజు, చింతకింది శ్రీనివాస్, పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, పోలోజు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

# ప్రభుత్వం హామీలను తప్పక నెరవేరుస్తుంది


## ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని పోచారం, పైడిపల్లి గ్రామాలలో నూతన నిర్మించిన పంచాయతీ భవనాలను శనివారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేయడం జరుగుతుందని టీఎస్పీఎస్సీ చైర్మన్ ను నియమించి ప్రక్షాళన చేయడం జరిగిందని, సంవత్సరంలోగా ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చబోతుందని ప్రాధాన్యత క్రమంలో ప్రతి గ్యారెంటీ హామీని బాధ్యతలు తీసుకొని అమలు చేస్తామని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పది లక్షల వరకు లబ్ది, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్నారని గుర్తు చేశారు. అదేవిధంగా త్వరలోనే రేషన్ కార్డులు, కొత్త ఇండ్లు, పింఛన్లు, రుణమాఫీ లాంటి పథకాలను అమలు చేసి చూపిస్తుందని రేవూరి ప్రకాష్ రెడ్డి భరోసా ఇచ్చారు. గ్రామాల్లో ప్రజలు కలిసిమెలిసి జీవించాలని అందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే గ్రామం అభివృద్ధి



చెందుతుందని ఎమ్మెల్యే సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు గ్రామ పరిపాలనను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. గ్రామ పంచాయతీలో ప్రజలను పాలనపరంగా పెట్టిందని, చిల్లిగవ్వ బిల్లులు చెల్లించక సర్పంచులకు గ్రామస్తులకు ముప్పు తిప్పలు పెట్టారని గుర్తు చేశారు. కొత్త ప్రభుత్వం ఇప్పుడు కొలువుదిరిందని అందరికీ అన్ని సౌకర్యాలను సమకూర్చుతామని పేర్కొన్నారు. ప్రజలు ఈ ప్రజా ప్రభుత్వానికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# 2024 పలు సినిమాలపై ఆసక్తి

## షూటింగ్ తదితర సమస్యలతో విడుదలలో ఆసల్యం

రానున్న నెలల్లో తెలుగు ప్రేక్షకులు ఆసక్తికరంగా ఎదురు చూసే సినిమాలు చాలానే వున్నాయి. రామ్ పోతినేని, పూరి జగన్ కాంబినేషన్ లో వస్తున్న 'డబుల్ ఇస్మార్ట్', ఎన్టీఆర్, కొరటాల శివ చేతులు కలిపిన 'దేవర' పార్టు వన్, అల్లు అర్జున్ తో దర్శకుడు సుకుమార్ చేస్తున్న 'పుష్ప 2' ఇంకా ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడి'. ఇందులో కొంచెం బడ్జెట్ ఎక్కువ వున్న సినిమాలు వున్నాయి, సీక్వెల్స్ వున్నాయి. పైన చెప్పిన సినిమాలు అన్నీ విడుదల తేదీలు అధికారికంగా ప్రకటించారు, ఇంకా రామ్ చరణ్, శంకర్ కాంబినేషన్ లో వస్తున్న 'గేమ్ చెంజర్' విడుదల తేదీ ప్రకటించలేదు కానీ ఆ సినిమా కూడా ఈ సంవత్సరమే విడుదలవుతుంది. అయితే ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలన్నీ విడుదల తేదీలు ప్రకటించినా ఈ సినిమాలన్నీ వాయిదా పడే అవకాశం వుందని అంటున్నారు. పూరి జగన్, రామ్ పోతినేని సినిమా ఇంకా షూటింగ్ చెయ్యాల్సి ఉందని, అదీ కాకుండా ఆ సినిమాకి కొంచెం ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురయ్యాయని వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఓటిటి, శాటిలైట్ హక్కులు ఇంతకు ముందులా పోవటం లేదని, అది కూడా ఒక కారణం అని అంటున్నారు. అందుకని ఈ సినిమా మార్చి నుండి వేసవి సెలవుల్లో విడుదల ఉండొచ్చు అని అంటున్నారు. దీనిమీద ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఇక ఎన్టీఆర్, కొరటాల శివ సినిమా 'దేవర' కూడా చాలా షూటింగ్ ఉందని, ఈ సినిమాకి ముఖ్యంగా కంప్యూటర్ గ్రాఫిక్స్ పని చాలా ఉందని అందుకని ఈ సినిమా అనుకున్న తేదీకి రాకపోవచ్చు అని అంటున్నారు. ఈ మధ్యనే ఇందులో విలన్ గా నటిస్తున్న బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ గాయాలు పాలై ఆసుపత్రిలో చేరారు. అతను కోలుకొని మళ్ళీ సెట్స్‌కి రావటానికి కొంచెం టైము పడుతుంది అని, అప్పుడు షూటింగ్‌లో డిలే ఉండొచ్చు, అందుకని సినిమా విడుదల వాయిదా వేయడానికి అవకాశం ఉందని అంటున్నారు. ఇక ప్రభాస్, నాగ్ అశ్విన్ ప్రతిష్టాత్మకంగా చేస్తున్న 'కల్కి 2898 ఏడి' అనే సినిమా కూడా ఇంకా చాలా గ్రాఫిక్ పని వుంది, షూటింగ్ కూడా కొంచెం చెయ్యాల్సి వుంది అని వార్తలు వస్తున్నాయి. అందుకని ఈ సినిమా కూడా అనుకున్న తేదీకి కాకుండా వాయిదా పడే అవకాశం వుంది అని అంటున్నారు. ఇది పాన్ ఇండియన్ సినిమాగా విడుదల అవుతుంది కాబట్టి, ఈ సినిమాకి హిందీ సినిమాలు ఏమీ పోటీ లేకుండా వున్న తేదీని చూసి విడుదల చేస్తారు అని అంటున్నారు. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకోన్, దిశా పటాని, దుల్కర్ సల్మాన్ లాంటి చాలామంది స్టార్స్ నటిస్తున్నారు. ఇంకా రానా దగ్గుబాటి కూడా వున్నారు అని అంటున్నారు. షూటింగ్ కూడా చెయ్యాల్సింది ఉందని అందుకని ఈ సినిమా వాయిదా పడే అవకాశం వుంది అని అంటున్నారు. ఇక 'పుష్ప 2' షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. దర్శకుడు సుకుమార్ తాను అనుకున్న అవుట్ ఫుట్ సరిగా వచ్చేవరకు తీస్తాడు. విడుదల తేదీ ప్రకటిం చేసాం కదా అని తొందరగా తీసే స్వభావం కాదు అతనిది. ఇంకా చాలా షూటింగ్ చెయ్యాల్సి వుందని అంటున్నారు. సినిమా మొత్తానికి హైలైట్ గా ఉండబోతున్న గంగమ్మ జాతర పాట ఒక్కటే సుమారు ఒక నెల రోజుల పాటు చిత్రీకరించారని తెలిసింది. అదీ కాకుండా నీళ్లలో ఒక పోరాట సన్నివేశం ఉందని, దానికి హోమ్ వర్క్ చెయ్యడమే నెల రోజులు అయిందని, దానికి యాక్షన్ కొరియోగ్రాఫర్ పీటర్ హెయిన్స్ నేతృత్వంలో చేశారు అని తెలుస్తోంది. ఇప్పుడు ఆ పోరాట సన్నివేశం చిత్రీకరించాల్సి వుంది. ఇక ఈ సినిమాలో కేశవ పాత్ర చేసిన జగదీశ్ అరెస్టవటంతో అతనితో చెయ్యాల్సిన సన్నివేశాలు డిలే అయ్యాయని కూడా తెలిసింది. అతను బయటకి వచ్చాడు, అతని మీద సన్నివేశాలు తీయాల్సి ఉందని అంటున్నారు. రష్మిక మందన్న ఇంకా పూర్తిగా ఈ సినిమా షూటింగ్ లో పాల్గొనలేదని, ఆమె మీద చిత్రీకరించాల్సింది చాలా ఉందని అంటున్నారు. ఇలా అన్ని సినిమాలు విడుదల తేదీల్లో మార్పులు ఉండొచ్చు అని పరిశ్రమలో కొన్ని రోజుల నుండి చర్చ జరుగుతోంది. అలాగే సామజిక మాధ్యమాల్లో కూడా ఈ సినిమాలు విడుదల తేదీలు గురించి చాలా చర్చ వైరల్ అవుతోంది.

# విడుదలకు సిద్ధం

తమిళ హీరో విశాల్‌కు తెలుగులో కూడా మంచి మార్కెట్ ఉంది. ఆయన సినిమాలను తెలుగు ప్రేక్షకులు కూడా ఇష్టపడతారు. కారణం ఆయన తెలుగు నటుడే కావడం. కాకపోతే.. తమిళ ఇండస్ట్రీలో సెటిల్ అయ్యారు. అందుకే విశాల్ సినిమా కోసం తెలుగు ఆడియన్స్ కూడా ఎదురుచూస్తూ ఉంటారు. ఆయన హీరోగా వస్తున్న లేటెస్ట్ మూవీ రత్నం. మాస్ అండ్ యాక్షన్ చిత్రాల దర్శకుడు హరి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అవుట్ అండ్ అవుట్ మాస్ కంటెంట్ వస్తున్న ఈ మూవీ నుండి ఇప్పటికే విడుదలైన టీజర్ ఆడియన్స్ ను విపరీతంగా ఆకట్టుకుంది. దీంతో ఈ సినిమా రిలీజ్ కోసం ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. అయితే తాజాగా ఈ సినిమా రిలీజ్ పై క్లారిటీ ఇచ్చారు మేకర్స్. రత్నం సినిమా ఏప్రిల్ 26న థియేటర్స్ లోకి రానున్నట్లు అధికారిక ప్రకటన చేశారు. దీంతో విశాల్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. సమ్మర్ లో విశాల్ మాస్ సంభవం చూడబోతున్నారు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమాకు రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ సినిమాకు సంబందించిన ప్రమోషన్ పనులు కూడా త్వరలోనే మొదలుకానున్నాయి. వాటిలో భాగంగా.. ముందుగా రత్నం టీజర్ రిలీజ్ చేసి, ఆతరువాత వరుసగా సాంగ్స్ రిలీజ్ చేసి సినిమాపై హైప్ క్రియేట్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఇక విశాల్ నుండి వచ్చిన గత చిత్ర మార్క్ ఆంటోనీ బాక్సాఫీస్ దగ్గర మంచి విజయం సాధించింది. దీంతో రత్నం సినిమాపై అంచనాలు క్రియేట్ అవుతున్నాయి. అలాగే సినిమా కూడా ఉంటుందని, ఖచ్చితంగా విశాల్ కెరీర్ లో మరో బ్లాక్ బస్టర్ కన్ఫర్మ్ అంటూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు ఫ్యాన్స్. మరి నిజంగా ఈ సినిమా విశాల్ కు మరో హిట్టు అందిస్తుందా అనేది తెలియాలంటే మరో రెండు నెలల ఆగాల్సిందే.



# అక్రమ నిర్మాణాలపై బల్దియా కొరడా





## పలు ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు

## కట్టడాలను కూల్చివేసిన అధికారులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ లోని పలు ఆక్రమణలపై రెవిన్యూ, బల్దియా అధికారులు కొరడా ఝులిపించి శనివారం నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించారు. బల్దియా పరిధి 42వ డివిజన్ వరంగల్ నాయుడు పెట్రోల్ పంప్ సమీపంలో గల ఖిలా వరంగల్ మండల రెవిన్యూ పరిధి 140సర్వే నంబర్ పుల్లయ్య కుంటలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఏసీ షెడ్, గోడలను రెవెన్యూ, పోలీస్ అధికారులు కూల్చివేశారు. గ్రేటర్ వరంగల్ లోని 11వ డివిజన్ ములుగు రోడ్డు కాపువాడలో సీల్ట్ ఫోర్ ప్లస్ అనుమతులు పొంది నిబంధనలకు విరుద్ధంగా పెంట్ హౌజ్, సిల్ట్ లో ఆక్రమణలు చేసి నిర్మించిన కట్టడాలను బల్దియా టౌన్ ప్లానింగ్, డీఆర్ఎఫ్ సిబ్బంది సంయుక్తంగా కూల్చివేశారు. వరంగల్ ఆర్టీఏ కార్యాలయం సమీపంలో పుల్లాయికుంట ప్రభుత్వ స్థలంలో నిర్మించిన దుకాణ సముదాయాలను కూల్చి వేశారు. ఎకరం భూమిని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయానికి అప్పటి అధికారులు కేటాయించగా ఆ భూమిలో కొంతమంది బడా వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీంతో అక్రమ నిర్మాణాలపై వరంగల్ మహా నగర పాలక సంస్థ అధికారులు కూల్చి వేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ, పోలీస్, టౌన్ ప్లానింగ్, డీఆర్ఎఫ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మేడారం మహా జాతర పోస్టర్ ఆవిష్కరణ



## విడుదల చేసిన సీఎం రేవంత్, మంత్రులు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సచివాలయంలో మేడారం మహా జాతర పోస్టర్ ను శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### మేడారంలో భక్తులకు మెరుగైన వైద్య సేవలు

మేడారం జాతరకు తరలివచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మేడారం జాతరకు తరలివచ్చే భక్తుల సౌకర్యం కోసం వైద్య, ఆరోగ్య శాఖ పై మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ శనివారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసుకోవాలని, అత్యవసర పరిస్థితులలో వైద్య సాయం అందించడానికి, బైక్ అంబులెన్స్, అంబులెన్స్ లను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార కల్తీ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సంక్రాంతి నుంచే వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సిబ్బంది మేడారం మహా జాతరకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. వైద్య శాఖ ఉన్నతాధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పర్యవేక్షించాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు.

# కోదండరామ్‌కు ఎమ్మెల్సీ.. ప్రజా ఉద్యమాలకు గౌరవం

## అభినందనలు తెలిపిన ఆల్ ఇండియా ఓబీసీ జాక్

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** విప్లవోద్యమాల నుంచి మొదలుకొని, హక్కుల సంఘాలు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించడమే కాకుండా తెలంగాణలో కేసీఆర్ దుష్ట పాలన అంతం కోసం అలుపెరగని పోరాటం చేసిన ప్రొఫెసర్ కోదండరామ్ కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం ఉద్యమాలను గౌరవించినట్లని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో గవర్నర్ కోటాలో కోదండరామ్ కు ఎమ్మెల్సీ పదవి లభించిన సందర్భంగా శనివారం హైదరాబాద్ లోని కోదండరామ్ నివాసంలో కలిసి అభినందనలు తెలిపి మాట్లాడారు. ఉద్యమ నాయకులకు పదవులు ఇచ్చి గౌరవిస్తున్న తెలంగాణ ప్రభుత్వం, ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడంలో కూడా అంతే శ్రద్ధ చూపాలని కోరారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో గడిచిన పదేళ్లలో ఎంతో అణచివేత జరిగిందని, ఉద్యమకారులను తీవ్రంగా అణచివేసి, ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కారని అన్నారు. ఎన్నో ఉద్యమాలలో కీలకపాత్ర పోషించి ప్రజల కష్టాలను, తెలంగాణ బాధలను దగ్గర నుంచి చూసిన నేను నాకు లభించిన పదవితో తెలంగాణలో ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చడంతో పాటు ఉద్యమకారుల సంక్షేమం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మహమ్మద్ మహమూద్, బీసీ నాయకులు కూనూరు రంజిత్ గౌడ్, కంకటి సాగర్ లు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో.. జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేవిధంగా కృషి చేయాలని సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో హనుమకొండ జిల్లాలోని వివిధ మండలాల్లోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పదో తరగతి పరీక్షల్లో విద్యార్థుల అభ్యసన స్థాయిలను మరింత మెరుగుపర్చడం అనే అంశం పై సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల సంఖ్య, అన్ని సబ్జెక్ట్ ల్లో విద్యార్థుల మార్కుల ప్రగతి ఎలా ఉందనే వివరాలతో పాటు వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులను ఏవిధంగా సన్నద్ధం చేస్తున్నారనే వివరాలను ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు విద్యార్థుల అటెండెన్స్ ను పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. గతంలో కంటే ఈసారి పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ హై, జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### కాళోజీ కళా క్షేత్రం పనులపై రివ్యూ ..

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో హనుమకొండ బాలసముద్రంలో నిర్మిస్తున్న కాళోజీ కళా క్షేత్రం పనులపై కుడా అధికారులు, నిర్మాణ పనులు చేపడుతున్న ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం శనివారం సాయంత్రం జరిగింది . ఈ సందర్భంగా కాళోజి కళాక్షేత్రంలో నిర్మిస్తున్న ఆడిటోరియం, హాల్, ఇతర భవన నిర్మాణం, అందుకు సంబంధించిన ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయనే అంశాలతో పాటు గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేయడంపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా కుడా అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల కాళోజి కళా క్షేత్రం పనులను జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సమీక్షా సమావేశంలో కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా జాతర పనుల పూర్తికి చర్యలు

## ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** మేడారం జాతర పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ హరిత హోటల్, దేవాలయ పరిసరాలు, ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్, ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఊరట్టం రోడ్డు అభివృద్ధి పనులు, కన్నేపల్లి సారలమ్మ దేవాలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ శాఖల ద్వారా ప్రతిపాదిత పనులన్నీ ఈ నెలాఖరుకు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తాత్కాలిక పనులు, అప్పటికప్పుడు చేయాల్సినవి ప్రణాళికాబద్ధంగా పూర్తికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయిలో వుండి, పనుల పర్యవేక్షణ చేస్తున్నట్లు, ప్రతిరోజు పనుల పురోగతిని సమీక్షిస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. పనులు నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా జిల్లా స్థాయి అధికారులతో జోనల్ వైజ్ బృందాలు ఏర్పాటు చేసినట్లు, ఈ బృందాలు ప్రతిరోజు క్షేత్ర సందర్శన చేసి, పనుల నాణ్యత, త్వరితగతిన పూర్తికి చర్యలు తీసుకొంటాయని, పనుల పురోగతిపై ప్రతిరోజూ నివేదిక సమర్పిస్తాయని కలెక్టర్ అన్నారు. కన్నేపల్లి సారలమ్మ దేవాలయం వద్ద టాయిలెట్స్ మరమ్మతులు చేయించాలని, సెంటర్ లో ఉన్న వీధి దీపాల మరమత్తులు చేపట్టి వెంటనే అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అన్ని సదుపాయాలకల్పనకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ ఓ రాజేందర్, ఈఈ పీఆర్ అజయ్ కుమార్, డీపీఓ వెంకయ్య, తాడ్వాయి తహసీల్దార్ రవీందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com